మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన ఎమ్మెల్యే

నర్సాపూర్, జనవరి 21: మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి గచ్చిబౌలిలోని ఆయన నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు సమస్యలపై మాజీమంత్రి హరీశ్‌రావుతో చర్చించానని చెప్పారు. ఆమెతోపాటు కొల్చారం మండల మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, షేక్‌రెడ్డి, నవాజ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

కర్ణాటకలో బతుకమ్మలతో పెద్దచింతకుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు

సమైక్యతా శిబిరంలో బతుకమ్మలతో మన విద్యార్థినులు

నర్సాపూర్, జనవరి 21: మండల పరిధిలోని పెద్దచింతకుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు కర్ణాటక రాష్ట్రంలో జరిగిన వేదికలో బతుకమ్మలు, బోనాలెత్తారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన పదిమంది వలంటీర్లు గుల్బర్గా విశ్వవిద్యాలయంలో ఈనెల 15వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయ సమైక్యతా శిబిరంలో పాల్గొన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలకు చెందిన వలంటీర్ శైలజ (బీఎస్సీ, తృతీయ సంవత్సరం) బృందానికి నాయకత్వం వహిస్తున్న డాక్టర్ బి.సురేశ్‌కుమార్ శిబిరంలో పాల్గొన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి హాజరైన వలంటీర్లతో కలిసి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని జాతీయ సమగ్రతను చాటారు.

నిర్లక్ష్యంతో కుటుంబాలు రోడ్డుపాలు

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, జనవరి 21: కొద్దిపాటి నిర్లక్ష్యం ఫలితంగా కుటుంబాలు రోడ్డు పాలవుతాయనే విషయాన్ని గ్రహించాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. కొన్నేండ్లుగా రోడ్డు ప్రమాదాలు జరిగిన స్థలంలో ప్రమాదాల నివారణలో భాగంగా ఎన్‌హెచ్ 44, ఎన్‌హెచ్ 161, ఎన్‌హెచ్ 756డీ లపై అధిక వేగంతో వచ్చే వాహనాలను గుర్తించి వాటి వేగాన్ని రికార్డు చేసి జరిమానా విధిస్తామన్నారు. మద్యం తాగి, అతివేగంగా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు అందరూ సీట్ బెల్ట్ ధరించాలని, మోటర్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దని హెచ్చరించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై పర్యవేక్షణలో వాహనాలు తనిఖీ చేస్తామని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ నియమాలు పాటించి రోడ్డు భద్రతలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు.

అత్యాశే సైబర్ నేరగాళ్ల ఆయుధాలు

ఆశ, అత్యాశే సైబర్ నేరగాళ్ల ఆయుధాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. విలాసవంతమైన వస్తువులిస్తామని, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేస్తామని, విదేశీ యాత్రలకు పంపుతామని, రకరకాల మాయమాటలతో ఆఫర్లు పెట్టి, ప్రజల నుంచి మొదటగా సభ్యత్వాలను స్వీకరించి, వారితో మరికొంతమందిని సభ్యులుగా చేర్పించే ప్రయత్నం చేస్తూ, ఎంత ఎక్కువ మందిని సభ్యులుగా చేర్పిస్తే అంత అధిక మొత్తంలో డబ్బులు తిరిగొస్తాయని నమ్మించి ప్రజల్ని మభ్యపెట్టే కొత్త టెక్నిక్‌తో సైబర్ నేరగాళ్లు మార్కెట్లోకి వస్తున్నారని తెలిపారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఒకవేళ అన్ని జాగ్రత్తలు తీసుకున్నా కూడా మోసపోయిన పక్షంలో ఆలస్యం చేయకుండా 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు గానీ సమీప పోలీస్ స్టేషన్‌లో నైనా ఫిర్యాదు చేయాలన్నారు.

శివ్వంపేట, జనవరి 21: మండలంలోని లచ్చిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన సత్యనారాయణకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.33వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లచ్చిరెడ్డిగూడెం కుమార్, కుంట లక్ష్మణ్, నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ రహదారి నియమాలు పాటించాలి

రహదారి సురక్షా అభియాన్ శ్రద్ధ వాల్‌పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జనవరి 21: ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో రవాణా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం రహదారి సురక్షా అభియాన్ శ్రద్ధ 2025 గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఈనెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నెల రోజులపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు రోడ్డు భద్రత పట్ల అవగాహన కల్పించి ప్రమాదాలు తగ్గించడం, ప్రజల ప్రాణాలను కాపాడటమే లక్ష్యమన్నారు. బుధవారం ఉదయం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణం నుంచి రాందాస్ చౌరస్తా వరకు 9వ తరగతి నుంచి డిగ్రీ చదువుతున్న విద్యార్థులతో బైక్‌ర్యాలీ ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రవాణా శాఖ అధికారి వెంకటస్వామి, విజయలక్ష్మి, శ్రీలేఖ, విజయలక్ష్మి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సరస్వతీమాత విగ్రహం ధ్వంసం

దుండగులను శిక్షించాలని నిరసన తెలుపుతున్న గ్రామస్తులు, విద్యార్థి సంఘాల నాయకులు (ఇన్‌సెట్‌లో) ధ్వంసమైన సరస్వతీమాత విగ్రహం

నిజాంపేట, జనవరి 21: మండలంలోని నార్లాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతీ మాత విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు ధ్వంసమైన సరస్వతీ మాత విగ్రహాన్ని చూసి తల్లిదండ్రులకు తెలియజేశారు. గ్రామస్తులు, విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల వద్దకు చేరుకొని సరస్వతీమాత విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలని కల్వకుంట-నార్లపూర్ ప్రధాన రోడ్డుపై నిరసన తెలిపారు. ధర్నాలో మాజీ ఉపసర్పంచ్ సంజీవ్, తల్లిదండ్రులు, సంఘాల నాయకులు, విద్యార్థులు ఉన్నారు.

అధికారంలో లేకపోతే ఎమ్మెల్యే ఫొటో పెట్టరా..

తుల్జారాంపేట్‌లో అడిషనల్ కలెక్టర్ నగేశ్‌తో వాగ్వాదానికి దిగిన మాజీ జడ్పీటీసీ బాబ్యానాయక్, మాజీ సర్పంచ్ సామ్యానాయక్

నర్సాపూర్, జనవరి 21:అధికార పార్టీలో లేనంత మాత్రానా ఎమ్మెల్యే ఫొటో ఫ్లెక్సీలో పెట్టరా అంటూ మండలపరిధిలోని తుల్జారాంపేట్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో అడిషనల్ కలెక్టర్ నగేశ్‌ను మాజీ జడ్పీటీసీ బాబ్యానాయక్, మాజీ సర్పంచ్ సామ్యానాయక్, ఇతర బీఆర్ఎస్ నాయకులు నిలదీశారు. మంగళవారం మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం తుల్జారాంపేట్‌లో ప్రజాపాలన గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ నగేశ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామసభలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఫొటో లేకపోవడంతో మాజీ జడ్పీటీసీ బాబ్యానాయక్, మాజీ సర్పంచ్ సామ్యానాయక్ ఇతర నాయకులు అడిషనల్ కలెక్టర్ నగేశ్‌తో వాగ్వాదానికి దిగారు. తక్షణమే ఫ్లెక్సీని తొలిగించాలని, లేదా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఫొటోను పెట్టాలని పట్టుబట్టారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి నిన్నమొన్న రాజకీయాల్లోకి వచ్చి గెలిచిన ఎమ్మెల్యే కాదని, ఆమె సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 20 ఏండ్లుగా ప్రజాసేవలో ఉంటూ ప్రజలకు సేవచేస్తున్న ఎమ్మెల్యేను ఇలా అవమానించడం మీకు తగదని అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, ఏ నియోజకవర్గంలో కూడా ఎమ్మెల్యేల ఫొటోలు పెట్టలేదని, గ్రామసభను సజావుగా జరిగేలా సహకరించాలని అడిషనల్ కలెక్టర్ వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఫ్లెక్సీలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఫొటో చేర్చే వరకు ఊరుకునేది లేదని భీష్మించుకు కూర్చోవడంతో చేసేది లేక అధికారులు గ్రామసభను పూర్తి చేయకుండానే మధ్యలోనే వెళ్లిపోయారు. అంతకుముందు బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాజీ జడ్పీటీసీ బాబ్యానాయక్ అడిషనల్ కలెక్టర్‌కు మెమోరాండం సమర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్‌తోపాటు డీఆర్‌డీఏ శ్రీనివాస్‌రావు, ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మధులత తదితరులు పాల్గొన్నారు.

తుల్జారాంపేట్ గ్రామసభలో అధికారుల నిలదీత

పిల్లుట్లలో ప్రొటోకాల్ రగడ

శివ్వంపేట, జనవరి 21: ప్రభుత్వం నిర్వహించే గ్రామ సభల్లో ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎంపీ రఘునందన్ రావు ఫొటోలు వేయకపోవడంపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఆందోళన చేశారు. ఇది ప్రభుత్వ కార్యక్రమమా లేక కాంగ్రెస్ కార్యక్రమమా అని నిలదీశారు. అనంతరం ఫ్లెక్సీని చింపివేసి కాంగ్రెస్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, బీజేపీ నేతలు చింత స్వామి, పెద్దపులి రవి, గుల్లయ్యగారి సుదర్శన్, శ్రీనివాస్ గౌడ్, పోచగౌడ్, శివకుమార్ ఉన్నారు.

పిల్లుట్లలో ఆందోళన చేస్తున్న నాయకులు



గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

అర్హులందరికీ లబ్ధి చేకూర్చడానికే గ్రామసభలు

కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, జనవరి 21(నమస్తే తెలంగాణ): 162 గ్రామ పంచాయతీలు, 21 వార్డుల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మంగళవారం మెదక్ మున్సిపాలిటీలో, శివయపల్లి, హవేళీఘనపూర్ మండలంలోని ఔరంగాబాద్ తండాలో లబ్ధిదారుల ఎంపికకు ఈనెల 21వే తేదీ నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 26 నుంచి ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, తదితర పథకాల ఎంపికకు ఈనెల 16 నుంచి 20 వరకు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించామన్నారు. గ్రామసభలో పథకాలను గుర్తించిన లబ్ధిదారుల జాబితాను గ్రామస్తుల సమక్షంలో చదివి తదుపరి ప్రజల నుంచి అభ్యంతరాలను తీసుకోనున్నట్లు తెలిపారు. సాగుకు యోగ్యమైన భూములను గుర్తించామని, ఇంకా ఎవ్వరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. సాగుభూమి లేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.1000 అందిస్తామన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన చేసి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా తదితర పథకాలకు నిరంతరం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గ్రామసభ ప్రారంభానికి ముందు ప్రభుత్వ సందేశాన్ని ఎంపీడీవో చదివి వినిపించారు. సభలో మున్సిపల్ చైర్‌పర్సన్ చంద్రపాల్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తదితర అధికారులు ఉన్నారు.

గందరగోళంగా గ్రామసభలు

- మెదక్ జిల్లాలో అధికారులను ఎక్కడికక్కడ నిలదీసిన ప్రజలు
- కొన్నిచోట్ల సభలు నిర్వహించకుండానే వెళ్లిపోయిన అధికారులు

నందగోకుల్‌లో అర్హులందరూ మళ్లీ దరఖాస్తులివ్వాలంటున్న ఎంపీడీవో రాజిరెడ్డి

చిలిపిచెడ్: అజ్జమర్రిలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

ఇల్లు మంజూరు చేయాలంటూ గొడవకు దిగి కమిషనర్‌ను నిలదీస్తున్న లబ్ధిదారుడు

నిజాంపేట, జనవరి 21: మండలంలో రజాక్‌పల్లి, రాంపూర్, నందగోకుల్, జడ్చెరువు, బచ్చురాజ్‌పల్లి గ్రామాల్లో మంగళవారం అధికారులు గ్రామసభలు నిర్వహించారు. నందగోకుల్ సభలో ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఎంపికైన వారి జాబితాను కార్యదర్శి భాగ్యలక్ష్మి చదువుతున్న క్రమంలో పేర్లు రాలేవంటూ గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు.

అజ్జమర్రిలో గ్రామసభ రచ్చరచ్చ

గూడూరు సభలో అధికారులపై మండిపడుతున్న ప్రజలు

చిలిపిచెడ్, జనవరి 21: భూమి ఉన్న వారిని భూమి లేని లబ్ధిదారులుగా గుర్తించారని, ఇందిరమ్మ ఇంటింటి సర్వేలో నిరుపేదలను గుర్తించకుండా గ్రామంలో నిరుపేదలు లేరని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ఎంతవరకు న్యాయమని ప్రజలు గ్రామసభలో రచ్చరచ్చ చేశారు. అజ్జమర్రి, టోప్యా తండా, సామ్యా తండాల్లో గ్రామసభలు ఏర్పాటు చేశారు. అజ్జమర్రిలో ఇందిరమ్మ కమిటీకి సంబంధించి గతంలో ఏర్పాటు చేసిన కమిటీని కొనసాగించాలని అధికారులను కోరారు.

ఇల్లు కేటాయించాలని గొడవకు దిగిన లబ్ధిదారుడు

రామాయంపేట, జనవరి 21: ఏడాదిగా ఇల్లు ఇవ్వాలని కోరుతున్నా ఇవ్వడంలేదని హరిజన కాలనీకి చెందిన పసుల దేవయ్య వార్డు సభలో గందరగోళం సృష్టించాడు. రామాయంపేట పురపాలికలోని ఒకటో వార్డులో జరుగుతున్న సభకు కమిషనర్ రావడంతో లబ్ధిదారుడు గొడవకు దిగాడు. కమిషనర్ గొడవ చేస్తున్న వ్యక్తిని సముదాయించి సభను ప్రారంభించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ పథకాలు అందజేస్తామని తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తులు అందజేయాలన్నారు.

గ్రామసభల్లో ప్రజల ఆందోళన

శివ్వంపేట, జనవరి 21: శివ్వంపేట మండలంలోని రూప్లతండా, లింగోజిగూడ, పిల్లుట్ల, గూడురు, తాళ్లపల్లి తండా, గంగాయపల్లి, చెన్నాపూర్ గ్రామాల్లో ప్రభుత్వ పథకాలపై అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ప్రతి గ్రామంలో పథకాలపై అనుమానాలు ఉండడంతో ప్రజలు ఆందోళన చెందారు.

అర్హుల పేర్లు రాలేదని ఆందోళనలు

చేగుంట, జనవరి21: మండలంలోని గొల్లపల్లి, ఇబ్రహీంపూర్, జెత్రాంతండా, కరీనగర్, కసాన్‌పల్లి, పోతాన్‌శెట్టిపల్లి, రాంపూర్, సోమ్లాతండా, ఉల్లితిమ్మాయిపల్లి, వల్భాపూర్‌లో గ్రామసభలు నిర్వహించగా, నార్సింగి మండలంలోని నర్సంపల్లి పెద్ద తండా, సంకాపూర్ తండా, బీంరావ్‌పల్లిలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్‌కార్డులు, రేషన్‌కార్డుల్లో చేరికలు వంటి పథకాలకు సంబంధించి లబ్ధిదారుల నుంచి దరఖాస్తు తీసుకున్నారు. గతంలో సర్వే చేసిన వాటిలో రాకుంచే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు.

అర్హుల పేర్లు లేకపోవడంపై అధికారులపై ఆగ్రహం

రాంపూర్‌లో అర్హుల పేర్లు రాలేదని ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

మనోహరాబాద్, జనవరి 21: మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలు రసాభాసగా సాగాయి. అర్హుల పేర్లు లేకపోవడం, ఇదివరకే లబ్ధిపొందిన వారి పేర్లను ప్రకటించడంతో ఆందోళన వాతావరణం కొనసాగింది. అధికారులను గ్రామస్తులు ఎక్కడికక్కడ నిలదీశారు. కొనాయిపల్లి పీటీలో జరిగిన సభలో తీవ్ర ఉద్రిక్తత వాతావరణం కొనసాగింది. లబ్ధిదారులు ఒకేసారిగా ఆందోళనకు దిగారు. తాము చేసుకున్న దరఖాస్తుల్లో ఒక్కటి కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేయగా, ఇది వరకు లబ్ధిపొంది, అనర్హులుగా ఉన్న వారి పేర్లు వచ్చాంటూ అధికారులను నిలదీశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ సుభాష్‌గౌడ్‌తోసహా గ్రామానికి చేరుకొని సముదాయించారు.

గ్రామసభల్లో ఎక్కడికక్కడ నిలదీత..

కొనాయిపల్లి పీటీలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

వెల్దుర్తి, జనవరి 21: మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. బొమ్మారం సభకు తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి హాజరై పథకాలపై ప్రజలకు వివరించారు. శెట్‌పల్లిలో రైతు ఆత్మీయ భరోసా పథకంలో 40 మంది వ్యవసాయ భూములు ఉన్న రైతుల పేర్లు ఉన్నాయని, భూములు లేని అర్హులైన వారి పేర్లు లేవని అధికారులను నిలదీశారు. రామాయిపల్లిలో తాగునీరు సరిగ్గా రావడం లేదని, కార్యదర్శికి చెప్పిన పట్టించుకోవడం లేదని మహిళలు మండిపడ్డారు. బండపోసాన్‌పల్లిలో ఇండ్లు ఉన్న వారి పేర్లు నమోదు చేశారని, ఇండ్లు లేని వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

టీ మాండాపూర్‌లో ...

చిన్నశంకరంపేట, జనవరి 21: టి.మాండాపూర్‌లో నిర్వహించిన గ్రామసభ రసాభాసగా సాగింది. నివాసగృహాలున్న వారి పేర్లు జాబితాలో మళ్లీ నమోదు చేశారని నిలదీశారు. ఉపాధి హామీ పనులకు రాని కూలీల పేర్లను సైతం నమోదు చేశారని అధికారులతో వాగ్వాదానికి దిగారు.

బడీడు పిల్లల గుర్తింపు

వెల్దుర్తి, జనవరి 21. బడికి రాని పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పిస్తామని వెల్దుర్తి కాంప్లెక్స్ సీఆర్పీ రాజు అన్నారు. మంగళవారం వెల్దుర్తి ఉన్నత పాఠశాల పీఈటీ శ్రీనివాస్, చర్లపల్లి ఉపాధ్యాయురాలు సునీతతో కలసి మండలంలోని చర్లపల్లిలో బడికి రాని ఇద్దరు పిల్లలను గుర్తించి ఒకరిని కేజీబీవీ పాఠశాలలో, మరొకరిని వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడీడు పిల్లలు కచ్చితంగా బడికి వెళ్లాలని, వెళ్లని వారిని గుర్తించి తామే పాఠశాలలో చేర్పిస్తామని చెప్పారు.

శ్మశానవాటిన కబ్జా

వెల్దుర్తి, జనవరి 21: పట్టణ శ్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేసి చదును చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తూప్రాన్‌కు వెళ్లే దారిలో కుడిచెరువు కట్ట కింది భాగంలో సర్వే నంబర్132లో 2.22 ఎకరాల విస్తీర్ణంలో శ్మశాన వాటిక ఉంది. శ్మశాన వాటిక కిందిభాగం రోడ్డుకు అవతల, వ్యవసాయ పొలాల వైపు ఉన్న కొంత స్థలాన్ని కబ్జా చేసిన అక్కమార్కులు జేసీబీ సాయంతో చదును చేశారు. ఈ విషయాన్ని గమనించిన పలువురు రైతులు, ప్రజలు కబ్జాదారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి, శ్మశాన వాటికను పూర్తిస్థాయి సర్వే చేసి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు అందజేత

రామాయంపేట, జనవరి 21: లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన రమేశ్‌గౌడ్ తన కుమారుడి పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు మంగళవారం పరీక్ష ప్యాడ్లు అందజేశారు. రమేశ్ గౌడ్ కుమారుడు కౌశిక్‌గౌడ్ అదే గ్రామంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. కౌశిక్‌గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా తండ్రి పాఠశాలకు వెళ్లి పదోతరగతి విద్యార్థులందరికీ ప్యాడ్లు, పెన్సిళ్లు, పెన్నులు అందించి పరీక్షలు మంచిగా రాయాలని కోరారు.

క్రీడాకారులకు చేయూత

చేగుంట, జనవరి 21: చేగుంటలో క్రీడాకారులకు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు అయిత పరంజ్యోతి చేయూత నందిచ్చారు. పట్టణంలోని ఎస్సీ కాలనీలో అంబేద్కర్ యూత్ అసోసియేషన్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వాలీబాల్ నెట్టును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జూకంటి రాజాగౌడ్, న్యాలపల్లి పంచాక్షరి, క్రీడాకారులు దుర్గాప్రసాద్, నవీన్, బాలేశ్, అక్బర్, గణేశ్, ప్రేమ్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పెద్దశంకరంపేట్ జనవరి 21: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయని మెదక్ ఆర్డీవో రమాదేవి అన్నారు. మంగళవారం ఆరెపల్లి, భూర్గుపల్లి, జములానాయక్ తండా, బద్దారం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఆరెపల్లిలో ఆర్డీవో మాట్లాడుతూ..రేషన్ కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ గృహాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పాపన్నపేట జనవరి 21: ఆకలితో ఇబ్బందిపడుతున్న పదోతరగతి విద్యార్థులకు అల్పాహారం అందించాలని పాపన్నపేట మండలం చీకోడ్ లింగాయిపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, చీకోడ్‌కు చెందిన ఉపాధ్యాయుడు భూపాల్ రెడ్డి మంగళవారం రూ.10వేల చొప్పున విద్యార్థులకు అల్పాహారం కోసం అందజేశారు. వీటితో సాయంత్రం ప్రత్యేక తరగతుల్లో స్నాక్స్ అందించాలని నిర్ణయించారు.

అవుట్ డోర్ స్టేడియంలో ఆలిండియా సివిల్ సర్వీసెస్ క్రీడలు

మెదక్ రూరల్, జనవరి 21: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ క్రీడల్లో భాగంగా మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని అవుట్ డోర్ స్టేడియంలో పురుషులు, మహిళా ఉద్యోగులకు జిల్లాస్థాయి చెస్, క్యారమ్స్, అథ్లెటిక్స్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి నాగారాజు మాట్లాడుతూ.. వివిధ క్రీడల్లో ఎంపికైన జట్లు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల కోసం నిర్వహించే ఈ క్రీడాపోటీలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆశలకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి

మెదక్ అర్బన్, జనవరి 21: ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆశలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18000 ఫిక్సిడ్ వేతనం నిర్ణయించాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ వర్కర్స్‌కి పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఏఎన్ఎం ట్రైనింగ్ పూర్తి చేసిన ఆశలకు, ఏఎన్ఎం పోస్టుల్లో ప్రమోషన్స్ కల్పించాలని, వెయిటేజ్ మార్కులు వెంటనే నిర్ణయించాలని డిమాండ్ చేశారు. 15 రోజుల సమ్మె హామీలు, కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిపెస్టోలో పొందుపర్చిన హామీలు, ఫిబ్రవరి 9న, జూలై 30, డిసెంబర్ 10న ఆరోగ్య శాఖ కమిషనర్ ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వ హామీ ప్రకారం ప్రసూతి సెలవులు కల్పిస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. 2021 జూలై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల పీఆర్సీ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

గూడూరు ప్రాథమిక పాఠశాలలో అధికారులు నిర్వహిస్తున్న గ్రామసభ

గ్రామసభతో విద్యార్థుల అవస్థలు

శివ్వంపేట, జనవరి 21: శివ్వంపేట మండలం గూడూరులో నిర్వహించిన గ్రామసభ విద్యార్థులకు తలనొప్పిగా మారింది. వివరాలలోకి వెళితే..ప్రభుత్వం నిర్వహించే గ్రామసభను అధికారులు ఏకంగా గూడూరు ప్రాథమిక పాఠశాల వరండాలో నిర్వహించారు. విద్యార్థులు గదుల్లో చదువుకుంటుంటే....వరండాలో నిర్వహించిన గ్రామసభ గొడవతో విద్యార్థులు అనేక అవస్థలు ఎదుర్కొన్నారు.

రామాయంపేట జాతీయ రహదారిపై విచారణ చేస్తున్న ఎస్సై బాలరాజు

జాతీయ రహదారిపై అర్ధరాత్రి దారి దోపిడీ

రామాయంపేట, జనవరి 21:అర్ధరాత్రి 44వ జాతీయ రహదారిపై కత్తులు, తల్వార్లు చూపెట్టి భయభ్రాంతులుకు గురిచేపి దారి దోపిడీకి పాల్పడిన ఘటన